జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 5-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 693 పేజీలు: 4 వెల: రూ.7

# అక్రమ వసూళ్లు కాదు..



# అక్క వసూళ్లు...!

- మద్యం అమ్మకాల్లో మామూళ్లు
- ప్రభుత్వ భూములు.. కబ్జా
- తరలిపోతున్న మట్టి, కంకర
- ఇది దొంగల, దోపిడీ రాజ్యం
- ధ్వజమెత్తిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- మందసలో వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం
- దద్దరిల్లిన మందస

మందస, జూన్ 4(వార్త):'అక్రమ' వసూళ్లు కాదు.. 'అక్క' వసూళ్లు.. కొండలు కరిగిపోతున్నాయి.. అక్రమంగా మట్టి, కంకర తరలిపోతోంది.. మద్యం అమ్మకాల్లో మాముళ్లు.. ప్రభుత్వ ఆక్రమణలకు గురవుతున్నాయి.. ఇదేనా కూటమి ప్రభుత్వ పాలన.. ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడి




రాజ్యమంటూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. పలాస నియోజకవర్గంలోని మందస పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న శిరీష పాలనలో ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. వైన్ షాపులు, బెల్ట్ షాపుల ద్వారా మద్యం సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు.

ఇవి అక్రమ వసూళ్లు కాదు... అక్క వసూళ్లు. పలాస నియోజకవర్గ ప్రజల జేబులను ఖాళీ చేస్తూ సాగుతున్న ఈ వసూళ్ల వ్యవస్థకు ప్రజలు విసిగిపోయారని డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రజలపై భారాలు మోపుతోందని ఆయన విమర్శించారు. ప్రజల తరఫున ఈ అన్యాయాలను ప్రశ్నించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**పోలీసులతో వైఎస్సార్ సీపీ నాయకులు వాగ్వుద్ధం..**

వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమంలో పోలీసులతో వైఎస్సార్ సీపీ నాయకులు వాగ్వుద్ధం జరిగింది. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మెనిఫెస్టోను అమలు చేయలేదని, మంటల్లో మేనిపెస్టోను వేయడానికి వైకాపా నాయకులు ప్రయత్నించడంతో మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమానికి మాత్రమే అనుమతి ఇచ్చామని, ఎక్కువ చేయవద్దని ఎస్ఐ చెప్పడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు, వైకాపా నాయకుల మాటలయుద్ధం జరిగింది. ప్రభుత్వానికి, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎన్ని ధనుంజయ, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాన ఆదినారాయణ, వైకాపా మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, చింతాడ గణపతి, గిన్ని తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, పార్టీ ముఖ్య నాయకులు అందాల శేషగిరిరావు, పులారి పితాంబరం, కర్రి గోపాలక్రిష్ణ, దున్న హరిక్రిష్ణ, సార రవికుమార్, మడియా రామకృష్ణ, బత్తిని లక్ష్మణ్, గుసిరి వెంకటరావు, సేనాపతి దివ్య, కంచి బెహరా, దుంపల వైకుంఠరావు, సుగ్గు కోటి, కొయిల ఈశ్వరరావు, సార రవికుమార్, దువ్వు జగదీష్, నాగేశ్వర బృందావన్, బాడ జగన్నాయకులు, బమ్మిడి ధర్మారావు, మార్పు క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





# లొద్దపుట్టి ఆర్ఎంపి ఇంట్లో మందులు సీజ్

ఇచ్ఛాపురం, జూన్ 4 (వార్త): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా అల్లోపతి మందులు విక్రయిస్తున్న ఓ ఆర్ఎంపీ పై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలో ఔషధనియంత్రణ శాఖ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ1లక్ష విలువైన మందులు గుర్తించి సీజ్ చేశారు. టెక్కలి ఔషధ తనిఖీ అధికారి (డ్రగ్ ఇన్స్పెక్టర్) ఎన్ యుగంధరరావు తెలిపిన వివరాలు ప్రకారం లొద్దపుట్టి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ ఎ.అమిత్ రాజ్ రెడ్డి అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్ లేకుండా తన ఇంట్లోనే భారీ స్థాయిలో అల్లోపతి మందులు నిల్వ ఉంచి రోగులకు విక్రయిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందటంతో ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు(అసిస్టెంట్ డైరెక్టర్) ఎం చంద్రరావు. టెక్కలి డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఎన్ యుగంధరరావు సంయుక్తంగా అమిత్ రాజ్ రెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో ఎలాంటి రికార్డులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన అల్లోపతి మందుల స్టాక్ ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సదరు ఆర్ఎంపీపై కేను నమోదు చేశారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

- ఆరు కేసుల్లో 157.64 గ్రాముల బంగారం, పల్సర్ బైక్ స్వాధీనం
- రూ.23.64 లక్షల విలువైన ఆస్తి రికవరీ
- నరసన్నపేట పోలీసుల చాకచక్యంతో ఇద్దరు నిందితుల అరెస్ట్

శ్రీకాకుళం క్రైం, జూన్ 4 (వార్త): నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన చైన్ స్నాచింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం ఉదయం 11 గంటలకు నరసన్నపేట మండలం సత్యవరం గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సర్వీస్ రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నరసన్నపేట ఎస్ఐ బి.గణేష్ తన సిబ్బందితో కలిసి అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు పలు జిల్లాల్లో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. విజయనగరం జిల్లాకు చెందిన ముండూరి సంతోష్ కుమార్ (24), బూర అశోక్ (23)లను అరెస్టు చేశామన్నారు. నరసన్నపేట పీఎస్ కేసుకు సంబంధించిన 29 గ్రాముల బంగారు గొలుసు, శ్రీకాకుళం రూరల్ పీఎస్ కేసుకు సంబంధించిన 34.99 గ్రాముల బంగారు గొలుసు, పోలాకి పీఎస్ కేసుకు సంబంధించిన 23 గ్రాముల బంగారు గొలుసు, విజయనగరం జిల్లా రామభద్రపురం పీఎస్ కేసుకు సంబంధించిన 46.65 గ్రాముల బంగారు గొలుసు, విశాఖపట్నం జిల్లా పెందుర్తి పీఎస్ కేసుకు సంబంధించిన 12 గ్రాముల బంగారు గొలుసు, విశాఖపట్నం జిల్లా గోపాలపట్నం పీఎస్ కేసుకు సంబంధించిన 12 గ్రాముల బంగారు గొలుసుతో పాటు నేరాలకు వినియోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమారు రూ.23,64,600 విలువైన ఆస్తిని రికవరీ



చేశామన్నారు. నిందితుడు సంతోష్ కుమార్ కార్పెంటర్‌గా పనిచేస్తూ తన స్నేహితుడు అశోక్‌తో కలిసి మద్యం సేవించడం, జల్సాలకు అలవాటు పడ్డాడన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై నెంబర్ ప్లేట్ తొలగించి, ముఖాలకు మాస్కులు ధరించి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సంచరిస్తూ ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కొని పరారయ్యేవారన్నారు. వీరు నరసన్నపేట, శ్రీకాకుళం రూరల్, పోలాకి, రామభద్రపురం, పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం ఆరు చైన్ స్నాచింగ్ కేసుల్లో నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో సొత్తును రికవరీ చేసిన టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్సై బి.గణేష్, సీసీఎస్ ఎస్సై భరత్, సర్కిల్ క్రైమ్ కానిస్టేబుళ్లు దాలి నాయుడు, ఆదినారాయణ, సీసీఎస్ కానిస్టేబుళ్లు శ్రీను, హరీష్లను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అభినందించి ప్రశంసించారు.

## కూటమి మోసాలపై కదం తొక్కిన వైసిపి

**సోంపేట, జూన్ 4(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయిలో గురువారం నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా గడచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వం మోసాలపై సోంపేట వైసిపి గురువారం కదం తొక్కింది. ఎంపీపీ డాక్టర్ నిమ్మనదాసు ఆధ్వర్యంలో జడ్పిటిసి తడక యశోద, తడక జోగారావు తదితరులతో కలిసి పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మెయిన్ రోడ్డు మీదగా నిరసన ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే కూటమి పాలన తీరుపై నేతలు దుమ్మెత్తి పోశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా తుంగలోకి తొక్కారని విమర్శించారు. హామీలను సక్రమంగా అమలు చేయకపోవడం, అనేక వాగ్దానాలు ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో పాటు మెగా డీఎస్సీలో దగా చేశారని అర్హులైన అభ్యర్థుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. నేతలు కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించగా తడక జోగారావు మాత్రం పూర్తిగా నలుపు దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గుర్రాల శ్రీను, సెలగాన భాస్కరరావు, పిన్నింటి రేఖరావు, పొడుగు కామేష్, సకల బత్తుల హరీష్, పిన్నింటి ఈశ్వరరావు, బట్టి మాధవరావు, తేజేశ్వర్ పట్నాయక్ పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ కోనేరు సమస్యలను పరిష్కరిస్తాం

### - పలాస మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



**పలాస, జూన్ 4(వార్త):** ముత్యాలమ్మ కోనేరు (పార్క్)లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తామని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ముత్యాలమ్మ కోనేరు పార్క్ సమస్యలపై గురువారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ముత్యాలమ్మ కోనేరు (పార్క్)లో నెలకొన్న సమస్యలను వాకర్స్ క్లబ్ సభ్యులు ఇటీవల తెలియజేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ శ్రీనివాస్ పార్కును సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఉదయం వేళల్లో గేదెలు, మేకలు, కుక్కలు పార్కులోకి ప్రవేశించి అక్కడ ఉన్న మొక్కలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్న సమయంలో కొందరు గంజాయి వ్యాపారులు పార్కు పరిసరాల్లో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, రాత్రి 9 గంటల తర్వాత మందుబాబులు పార్కులో మద్యం సేవిస్తూ మద్యం సీసాలు, ఇతర చెత్తను అక్కడే వదిలివెళ్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ శ్రీనివాస్ పార్కు చుట్టూ రక్షణ గోడ నిర్మాణం చేపట్టి సమస్యలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కి, ఎమ్మెల్యే గౌతు శిరీషకి, వజ్జ బాబూరావుకి వాకర్స్ క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

### -రహదారులను ప్రారంభించిన ఎంఎల్ఏ గౌతు శిరీష



**మందస, జూన్ 4(వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని నోతువార, మందవూరు గ్రామాలకు నిర్మించిన రహదారులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎంఎల్ఏ శిరీషా మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మందస మండలంలో కోటి అరవై లక్షలతో ఐటీడీఏ రోడ్లు నిర్మించడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం లభించిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఐటీడీఏ ద్వారా ఈ రోడ్లను నిర్మించడం జరిగిందని, దీంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి.. ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంబుగాంలో ఐటీడీఏ ద్వారా ఓల్డ్ ఎన్ హెచ్-5 నుంచి నోతువారా వరకు నిర్మించిన బీటీ రోడ్డు, హంసరాళి పంచాయతీ పరిధిలోని మందవూరు గ్రామం వద్ద ఐటీడీఏ ద్వారా ఎంఎం రోడ్డు నుంచి కిల్లోయి, డబార్సింగి వరకు.. మందవూరు మీదుగా నిర్మించిన బీటీ రోడ్డులను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి




**జలుమూరు, జూన్ 4(వార్త):** ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లను వినియోగిస్తున్న నేపథ్యంలో మహిళల భద్రత, అత్యవసర సహాయం కోసం ఉపయోగపడే శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తి టీం సభ్యులు గిరిధర్, భీమారావు మరియు మహిళా పోలీస్ విజయలక్ష్మి సూచించారు. గురువారం జలుమూరు మండలం టెక్కలిపాడులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఉపాధి వేతనదారులకు శక్తి యాప్ వినియోగంపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని, ముఖ్యంగా మహిళల భద్రతకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గించుకోవచ్చని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులకు కూడా దాని గురించి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఉపాధి వేతనదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భోజనంలో నాణ్యత పాటించాలి

**పోలాకి, జూన్ 4(వార్త):** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ ఎస్. శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం పోలాకి ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భోజన తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ముఖ్యంగా వంట చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, వంట పాత్రల శుభ్రత, తాగునీటి వినియోగం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం పోషక విలువలతో పాటు రుచికరంగా కూడా ఉండాలని పేర్కొన్నారు. వంట తయారీ సమయంలో నాణ్యమైన సరుకులను ఉపయోగిస్తూ పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భోజనంపై విద్యార్థులు సంతృప్తి చెందేలా వంట ఏజెన్సీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, మధ్యాహ్న భోజన పథకం విజయవంతం కావడంలో వంట సిబ్బంది పాత్ర కీలకమని ఎంఈఓ పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో పాఠశాల సిబ్బంది, వంట ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.



# మానవత్వం మరిచారా?


### -ఆర్‌టీసీ బస్సు ప్రమాదంలో మహిళ పాదం నుజ్జునుజ్జు

### -పట్టించుకోని అధికారులు, పోలీసులు -

### -దిక్కుతోచని స్థితిలో శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతున్న గజలక్ష్మి







సంతబొమ్మాళి, జూన్ 4(వార్త): ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యం ఒక పేద మహిళ జీవితాన్ని రోడ్డున పడేసింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ, ప్రమాదం జరిగితే మాకేం సంబంధం లేదంటూ చేతులు ఎల్లేసింది. అటు ఖాకీలు, ఇటు ఆర్టీసీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఓ పేద మహిళ ఆసుపత్రి మంచంపై నరకయాతన అనుభవిస్తోంది. చిన్నతుంగాం గ్రామానికి చెందిన సాహుకారి గజలక్ష్మి అనే మహిళ విశాఖ బోయపాలెం దగ్గర శ్రీకాకుళం డిపో-1 కు చెందిన ఒక ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు పూసపాటిరేగ సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా వెనుక ఎడమవైపు ఉన్న టైర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న గజలక్ష్మి ఎడమ కాలు పాదం పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. అయితే ఆ సమయంలో బస్సు సిబ్బంది పట్టించుకోకపోయినా సహ ప్రయాణికురాలే రక్షకురాలుగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు సిబ్బంది (డ్రైవర్, కండక్టర్) కనీస మానవత్వం లేకుండా ప్రయాణికురాలిని గాలికి వదిలేశారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెను చూసి చలించిపోయిన ఒక తోటి మహిళా ప్రయాణికురాలు వెంటనే స్పందించింది. దగ్గర లో ఉన్న ఆర్ఎంపీ ను పిలిపించి, ప్రాథమిక చికిత్స చేయించి, మానవత్వంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కూడా బాధితురాలి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సరిగ్గా పట్టించుకోకుండా విశాఖ కేజీహెచ్‌కు వెళ్ళిపోవాలంటూ చేతులు దులుపుకున్నారు. అక్కడ చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో, గత్యంతరం లేక బాధితురాలు శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో చేరింది. అత్యంత పేద కుటుంబానికి చెందిన గజలక్ష్మికి ఇప్పటివరకు సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చయింది. అంత డబ్బు పెట్టినా.. ఆమె కాలు అసలు నయమవుతుందో లేదో చెప్పలేమని వైద్యులు అనడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతున్నా కనీసం ఒక్క ఆర్టీసీ అధికారి కూడా బాధితురాలిని పరామర్శించడానికి గానీ, విచారణ చేయడానికి గానీ రాకపోవడంతో పలువురు ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ?బాధితురాలి బంధువులు న్యాయం కోసం శ్రీకాకుళం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురైంది. ప్రమాదం జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని, ఎక్కడ జరిగిందో అక్కడికే వెళ్ళాలని పోలీసులు దాటవేశారు. కనీసం "జీరో ఎఫ్ఐఆర్" కింద ఫిర్యాదు తీసుకొని, సంబంధిత స్టేషన్‌కు రిఫర్ చేయాలన్న కనీస చట్టపరమైన బాధ్యతను కూడా పోలీసులు మరచి పోవడం బాధాకరమని కుటుంబ సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?ఒక పేద మహిళ ప్రభుత్వ నమ్మకంతో ఆర్టీసీ బస్సు ఎక్కితే, కాలు పోగొట్టుకుని ఆసుపత్రి పాలైంది. ఇటు ఆర్టీసీ యజమాన్యం, అటు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి, బాధితురాలికి తక్షణ ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, పేదదైనా బాధితురాలకి తగిన నష్టపరిహారం ఇప్పించాలి కుటుంబ సభ్యులు బంధువులు కోరుతున్నారు. బాధ్యులైన బస్సు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైతుల సంక్షేమం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం



**పలాస, జూన్ 4(వార్త):** రైతుల సంక్షేమం -- కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పలాస ఆర్డీవో కార్యాలయంలో టిడ్కో గృహాల నిర్మాణం కోసం భూములు ఇచ్చిన 9 మంది రైతులకు రూ.1.15 కోట్లకు పైగా నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పట్ల తన బాధ్యతను మరోసారి చాటిచెప్పిందని, అభివృద్ధి, రైతు సంక్షేమం మధ్య సమతుల్యతను ప్రతిబింబించిందని అన్నారు. టిడ్కో గృహాల నిర్మాణం వంటి ప్రజాప్రయోజన కార్యక్రమాల కోసం భూములు అందించిన రైతుల త్యాగాన్ని గుర్తించి, వారికి సకాలంలో నష్టపరిహారం చెల్లించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో రైతుల పాత్ర ఎంతో కీలకమని గుర్తించిన ప్రభుత్వం, వారి హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించే దిశగా చర్యలు చేపడుతోందని చెప్పారు. ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేస్తూ నష్టపరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతుల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమైంది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే కాకుండా, వాటి వల్ల ప్రభావితమయ్యే రైతులు మరియు సాధారణ ప్రజల సంక్షేమాన్ని కూడా సమానంగా పరిగణిస్తోంది. రైతులకు నష్టపరిహారం చెల్లించడం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, వారి త్యాగానికి ప్రభుత్వం ఇచ్చే గౌరవం కూడా. "అభివృద్ధి కోసం రైతుల సహకారం -- రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ అంకితభావం" అనే సూత్రంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతూ, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీను, రెవెన్యూ అధికారులు, టిడ్కో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### - డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై డీఈఓ రవిబాబు సూచనలు

### - ఉపాధ్యాయుల బోధనే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని వ్యాఖ్య

**నరసన్నపేట, జూన్ 4(వార్త):** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రవిబాబు సూచించారు. గురువారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వంట ఏజెన్సీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందించే భోజనం విందు భోజనాన్ని తలపించేలా పరిశుభ్రంగా, రుచికరంగా ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై మధ్యాహ్న భోజన పథకం ప్రభావం ఉంటుందని, అందువల్ల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పేడాడ దాలినాయుడు, డీఆర్పీ ఉత్తర, వంట ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నరసన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను డీఈఓ రవిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యాబోధనలో సరైన పద్ధతులు పాటిస్తే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని తెలిపారు. ఒక ఉపాధ్యాయుడు సమర్థవంతమైన బోధన అందించకపోతే ఒక తరం నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి బోధన అందిస్తున్నారని అభినందించారు. విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



## రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

### -పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా

### -హరిపురంలో రైతులకు విత్తనాల పంపిణీ



**మందస, జూన్ 4(వార్త):** అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని హరిపురం సచివాలయం వద్ద గురువారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించి రైతులకు చేయూతనివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులందరూ విత్తనాలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ

### -హరిపురంలో అవగాహన సదస్సు

### -100మందితో ర్యాలీ




**మందస, జూన్ 4(వార్త):** హరిపురం-బాలిగాం జంక్షన్ లో ఝంకర్ డ్యాన్స్ స్కూల్ మేనేజింగ్, డైరెక్టర్ ప్రముఖ ఒడియా ఫిల్మ్ యాక్టర్ రిషికేశ్ సామల్ ఆధ్వర్యంలో మందస పోలీసుల పర్యవేక్షణలో హెల్మెట్ ధారణతో కలిగే లాభాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, పలాస సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు, మందస సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.కృష్ణప్రసాద్, సినీ నిర్మాత, డైరెక్టర్ కుమార్ నాయక్, నటుడు అమ్మ రామకృష్ణ, అసిస్టెంట్ డాన్స్ మాస్టర్ రంజిత్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు . ఈ సందర్భంగా హరిపురం పట్టణంలో గల అన్ని విద్యాసంస్థల నుంచి మేనేజ్ మెంట్, యువతీ, యువకులు హెల్మెట్ ధరిస్తూ పాల్గొని, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సుమారు 100మందితో హరిపురం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన మాట్లాడుతూ యువత ప్రదానంగా బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మన కోసం ఎదురు చూసే మన కుటుంబం ఆనందంగా ఉండటానికి అలాగే మన ప్రాణాల రక్షణకు హెల్మెట్ చాలా అవసరం అని వివరించారు. మందస ఎస్ఐ క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభయం కార్యక్రమం కోసం వివరిస్తూ, హెల్మెట్ మాత్రమే మనల్ని రోడ్డు ప్రమాదాలలో నుంచి కాపాడగలదని చెప్పారు. ప్రతీ ఒక్కరూ విధిగా దీనిని పాటించాలని కోరారు. అనంతరం ఝంకర్ డాన్స్ స్టూడియో పిల్లలచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులని ఆకట్టుకున్నాయి.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# బోరుభద్ర స్టాఫ్ నర్సుకు చార్జి మెమో

**సంతబొమ్మాళి, జూన్ 4 (వార్త):** బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న పాలిన రాము విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో మెమో ఇచ్చినట్లు డాక్టర్ ఆవని గురువారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే సుమారు 20 మంది రోగులకు ఇంజక్షన్ వేసే సమయంలో ఒకపక్క సెల్ఫ్ ఫోన్‌లో మాట్లాడుతూ ఇంజక్షన్ వేయడంతో చేతులకు వాపులు, కణతలు వచ్చాయి. దీనిపై స్టాఫ్ నర్స్ రామును బాధితులు నిలదీస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీనిపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆవనికి బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో స్టాఫ్ నర్స్ రాముకు మెమో ఇస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.

# ఇచ్ఛాపురంలో గళమెత్తిన వైసీపీ శ్రేణులు

## - కూటమి ప్రభుత్వం

## ప్రజలను వంచిందని ఆరోపణ



**ఇచ్ఛాపురం, జూన్ 4 (వార్త):** వెన్నుపోటుకు రెండేళ్ళు నిరసన కార్యక్రమం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. వైస్సార్సీపీ పిలుపునిచ్చిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాలలో భాగంగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో ఇచ్ఛాపురం పాత బస్టాండ్ వద్ద గల వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మానవహారంగా ఏర్పడి తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని నిరసన ప్రదర్శన చేశారు.

కూటమి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కూటమి మేనిఫెస్టో, ఆనాటి ఈనాడు పత్రికలో కూటమి సూపర్ 6 ఫుల్ పేజీ ప్రకటన కాపీలు, కూటమి నాయకులు ప్రజలను వంచించడానికి వాడిన చంద్రబాబు నాయుడు సంతకంతో ఉన్న హామీల బాండ్ లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సాడి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి పార్టీ లు కలసి సూపర్ 6 పేరుతో 6 హామీలతో మేనిఫెస్టో తయారు చేసి మా కూటమికి అధికారం కల్పిస్తే ఈ సూపర్ 6 పథకాలు సంపద సృష్టించి ప్రజలకు అందిస్తామని చెప్పి.. ప్రతి పథకం ఇవ్వకుండా ప్రజలను వంచించిందని ఆరోపించారు. మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు, మైనారిటీలను వంచించిన కూటమి బాగోతాన్ని ప్రజలకు తెలియపర్చడానికి చేపట్టిన నిరసన కార్యక్రమం తో కూటమి ప్రభుత్వం ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజాకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి మేనిఫెస్టో కాపీలు, ఈనాడు పత్రిక కాపీ, మోసపు బాండ్‌లు దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీస్ బలగం అడ్డు కోగా, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఆ ప్రతులను తగలబెట్టారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఇచ్ఛాపురం, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి సుగ్గు ప్రేమ్ కుమార్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, ఎంపీపీ బోర పుష్ప, శ్రీకాకుళం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, నియోజకవర్గం పోలింగ్ బూత్‌ల కన్వీనర్ సాలిన గాంధీ, నియోజకవర్గం మున్సిపల్ విభాగం అధ్యక్షులు కాళ్ళ సత్యరాజ్ యాదవ్, మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, డీసీఎంస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, పిలక దేవరాజు, మద్ది హిమశైలజ, మద్ది దుర్యోధన రెడ్డి, పిలక యాదవరెడ్డి,జిల్లా కార్యదర్శులు ఆశి పురుషోత్తం రెడ్డి, ఇసురు పరశురామ్ రెడ్డి, ఇసురు యాదవుడు రెడ్డి ఇచ్ఛాపురం మండలం, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, , నియోజకవర్గం,ఆర్ టీ ఐవిభాగం అధ్యక్షులు బదకల మోహన్ దాసు, ఇచ్ఛాపురం మండల ఉపాధ్యక్షులు ఇసురు తులసిరామ్, గుజ్జు ఢిల్లీ రావు,ప్రధాన కార్యదర్శి రంగాల జానకిరామ్ రెడ్డి, సాలిన ఢిల్లీ, దక్కత లోకనాధం రెడ్డి, కారింగి మోహన్ రావు, కారింగి త్రినాద్, దుక్క ఆనంద్ , పిట్ట విశ్వనాధం, పిట్ట ఆనంద్, బాకి లక్ష్మీనారాయణ, జుత్తు బేసింగి, లోపింటి దీనబంధు రెడ్డి, నీలాపు ఢిల్లీ, గుజ్జు తారకేసు నీలాపు జగదీశ్, నీలాపు సారధి, చల్ల కృష్ణారెడ్డి వడ్డీన తేజ, సాడి జయరాం రెడ్డి, కోప్పల హేమంత్, జుత్తు కామేష్ కిరణ్ బెహరా, చిడిపోతు జగన్,ఆదినారాయణ రాత్తకన్న, తిప్పన కృష్ణారెడ్డి, సప్ప వంశీ సాడి జయరాం, చాట్ల తిరుపతి,కాళ్ళ దేవరాజు, కాళ్ళ తేజ, కాళ్ళ నారాయణ, బింగి నీలాద్రి, బోరుపద్ర పాపయ్య, పాతిర్ల జగదీశ్, గానాల చిరంజీవి, బొబ్బిలి దేవరాజు, హంగిర్ బెహరా, నైన తేజ బాకి తిరుపతి, ఈగల దేవదాసు,పటాన నీలాద్రి, బింగి త్రినాద్, పాతిర్ల వెంకటేష్, బుడత ప్రకాష్, దక్కత శ్రీరాములు, దక్కత రఘు,కోట జనార్ధన, వడ్డీన మురళి, వగాడి ఢిల్లీ, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బాబు వెన్నుపోటుకు రెండేళ్లు



**కొత్తూరు, జూన్ 4(వార్త):** చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండల కేంద్రం బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసనలతో మార్మోగింది. పార్టీ అధిష్టానం పిలుపు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. పార్టీ శ్రేణులు, అభిమానులు ప్లకార్డులు చేతబట్టి చంద్రబాబు వైఖరిని ఎండగడుతూ నినాదాలు చేశారు. ర్యాలీతో కొత్తూరు ప్రధాన కూడలిలో నిరసనకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సవర సావిత్రి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతాడ సూర్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గుడబండి పోలయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అగతముడి నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు ధర్మారావు, గంధవరం నాగేంద్ర, అగతముడి రంజిత్ కుమార్, నాస బాలకృష్ణ, పెద్ద కోట సాదుబాబు, దూళి అప్పన్న, ఎంపీటీసీలు వనము లక్ష్మీనారాయణ, సవర రమేష్, నేతలు బొమ్మాలి నగేష్, గార రాజులనాయుడు, రాఘవ నరసింహారెడ్డి సహా మండలంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## ఖరీఫ్ సాగుకు పైడిగాం నీరు అందించాలి



**సోంపేట, జూన్ 4(వార్త):** రానున్న ఖరీఫ్ సీజన్లో పంటలకు పైడిగాం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందించే ఏర్పాటు చేయాలని ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు కోరారు. పైడిగం కాలువలో జరుగుతున్న పనులను గురువారం సంఘ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీ రావు మాట్లాడుతూ పైడిగాం కాలువ పనులు చేపట్టడం సంతోషకరమని అన్నారు. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధుల వద్దకు,సంబంధిత అధికారుల వద్దకు, జిల్లా కలెక్టర్ వద్దకు బీసీ సంఘం తరపున వెళ్లి అర్జీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కాలువలో పూడికతీత పనులు అలాగే థర్డ్ యాప్రాన్, చీకటి గడ్డ సైఫోన్, మధుముల షట్టర్లు త్వరగా బిగించి నీట్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పనుల పరిశీలనలో గార కృష్ణారావు, ఎర్ర గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

### -మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు



**పలాస, జూన్ 4 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో ఏపీ టిడ్కో - ప్రధానమంత్రి ఆ యోజన (యు) పథకం కింద 300 స్క్వేర్ ఫీట్ / 360/ 430 స్క్వేర్ ఫీట్ గృహాల కొరకు దరఖాస్తు చేసి, సంబంధిత మొత్తాలను డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో చెల్లించిన కొంతమంది దరఖాస్తుదారులు గృహాలు మంజూరు కాకపోవడంతో, వారు చెల్లించిన మొత్తాలను ప్రభుత్వము తిరిగి చేల్లిస్తున్నా విషయము ప్రజల దృష్టికి తీసుకొస్తున్నామని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత దరఖాస్తుదారులు చెల్లించిన డిమాండ్ డ్రాఫ్టులు, మున్సిపల్ రసీదులు, ఇతర పత్రాలను పరిశీలించిన అనంతరం, ప్రభుత్వం వారు చెల్లింపుల మొత్తాన్ని చెక్కుల ద్వారా తిరిగి చెల్లించబడునని తెలిపారు. ఏపీ టిడ్కో - ప్రధానమంత్రి ఆయోజన గృహ పథకానికి సంబంధించి చెల్లింపులు చేసి గృహాలు మంజూరు కానీ దరఖాస్తుదారులు తమ వద్దనున్న పత్రాలతో పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన వివరాలను నిర్ధారించుకోవలసినదిగా తెలియజేశారు. ఈ ప్రకటనపై ఎవరైనా అభ్యంతరాలు, హక్కులు లేదా క్లైమ్ లు కలిగి ఉన్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఏడు రోజులలోపు తగిన ఆధారాలతో పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయానికి లిఖితపూర్వకముగా తెలియజేయగలరని పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎవరైనా గృహాల కోసం డబ్బులు చెల్లించుంటే శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి పలాస మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

## వైసీపీ వినాశకర పాలనకు పాతరేసి రెండేళ్లు



**ఇచ్ఛాపురం జూన్ 4(వార్త):** రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు పాతరేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుని నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ జైదేవ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పారని, భవిష్యత్తులో కూడా అలాంటి విధ్వంసకర రాజకీయాలకు ప్రజలు స్థానం కల్పించరని ఇచ్ఛాపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ పేర్కొన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, ప్రజల సమస్యలను గాలికొదిలేసి, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు మరియు సాధారణ ప్రజలపై కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం మరియు సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, వైసీపీ నాయకులు వాస్తవాలను జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రజల తీర్పును గౌరవించకుండా విద్వేష రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు మరియు యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నారని, అందుకే ప్రజావ్యతిరేక విధానాలకు కాలం చెల్లిందని కాళ్ళ జైదేవ్ స్పష్టం చేశారు.



# రైతులకు నూతన పాస్ పుస్తకాల పంపిణీ

### - క్యూఆర్ కోడ్, ప్రభుత్వ రాజముద్రతో భద్రతా ప్రమాణాలు

### -"మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తి

**సారవకోట, జూన్ 4 (వార్త):** రైతుల భూహక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం సారవకోట మండలం గోపాలపురంలో నిర్వహించిన "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్, ప్రభుత్వ రాజముద్రతో రూపొందించిన ఈ కొత్త పాస్ పుస్తకాలు రైతుల భూ వివరాలకు మరింత భద్రత కల్పిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి ఫోటోలు ముద్రించడం, భూమి సరిహద్దు రాళ్లపై కూడా రాజకీయ గుర్తులు ఉంచడం రైతుల్లో ఆందోళనకు కారణమైందని వ్యాఖ్యానించారు. రైతుల భూముల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇప్పుడు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం, లిటిగేషన్ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని కూడా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల భూమి హక్కుల పరిరక్షణలో ఈ కొత్త పాస్ పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని, పారదర్శక వ్యవస్థ ద్వారా రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పొద్దిన రత్నాలునాయుడు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ చైర్మన్ పొదిలాపు వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీముఖలింగేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.11 లక్షలు

### -71 రోజుల ఆదాయాన్ని లెక్కించిన అధికారులు

### - సత్యసాయి సేవాసమితి సభ్యులు, పోలీసుల సమక్షంలో ప్రక్రియ

**జలుమూరు, జూన్ 4(వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. ఉదయం ఆలయ హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన నగదు, కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 71 రోజుల కాలానికి గాను హుండీ ద్వారా మొత్తం రూ.3,11,196 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామివారిపై ఉన్న విశ్వాసంతో పెద్ద సంఖ్యలో కానుకలు సమర్పిస్తున్నారని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు ఈవో తెలిపారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు, పోలీసు సిబ్బంది, మందస దేవాలయ కార్యనిర్వహణ అధికారి ఎస్. నాగేశ్వరరావు సమక్షంలో లెక్కింపు చేపట్టినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం హుండీ ఆదాయాన్ని వినియోగించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.






# అభయ ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే రమణమూర్తి

### - ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరణ

### - భక్తిశ్రద్ధల మధ్య తృతీయ వార్షికోత్సవం

**సారవకోట, జూన్ 4 (వార్త):** సారవకోట మండలం అలుదు గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ అభయ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి తృతీయ వార్షికోత్సవ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామస్థుల ఆహ్వానం మేరకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో మాట్లాడారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ పొదిలాపు వేణుగోపాలరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయని, గ్రామ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రాణాలను కాపాడే దివ్య ఔషధం మొక్కలు

**మందస, జూన్ 4(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మందస పట్టణంలో గో గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో మందస మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో ఎ.తిరుమలరావు చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. అనంతరం మొక్కల సంరక్షణ కోసం ఎస్ఎంఆర్ ఫౌండేషన్ అందించిన ఐరన్ ట్రీ గార్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ఎ.తిరుమలరావు మాట్లాడుతూ ఒక మొక్క నాటడం అంటే ఒక ప్రాణాన్ని కాపాడినట్టేనని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని, నేడు మనం నాటిన మొక్కలు రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయన్నారు. ప్రతీ ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. గో గ్రీన్ సంస్థ చేస్తున్న పర్యావరణ కృషి ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. మెయిన్ రోడ్ డివైడర్ లో ఆ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.రుషేశ్వరరావు, సోషల్ వర్కర్ గిన్ని తిరుపతి రెడ్డి, సంతోష్ కుమార్ పాండా, గార కృష్ణారావు, మామిడి కోదండరావు, బాలరాజు, రాకేష్ బెహరా, మందస టౌన్ యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



## రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు



**ఇచ్ఛాపురం, జూన్ 4 (వార్త):** అర్హులైన ప్రతీ రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గురువారం కీర్తిపురం పంచాయితీలో సమావేశం నిర్వహించి కీర్తిపురం, పాయితారి పం చాయితీల రైతులకు సంబందించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాజముద్రతో కాకుండా జగన్ బొమ్మను పెట్టుకొని తప్పులు తడకలతో కూడిన పాస్ పుస్తకాలను రైతులుకు అం దజేశారని అవి ఇప్పుడు దేనికీ పనికిరాకుండా పోయాయని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. సొంత బొమ్మలతో పాస్ పుస్తకాలు, సర్వేపేరిట జగన్ బొమ్మలతో సర్వేరాళ్లు వేసి ప్రజాదనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో భూముల రీసర్వే చేసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశామన్నారు. ఇందులో భాగంగా కీర్తిపురం, పాయితారి పంచాయితీలలో 520 పాస్ పుస్తకాలు లో తప్పులు లేకుండా 454 పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని మిగిలిన 64పాస్ పుస్తకాల ప్రింటిగ్లో తప్పులు ఉన్నాయి వాటిని సరిచేసి మరో రెండు మూడు రోజుల్లో అధికారులు అం దించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి తహశీల్దార్ వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం సాది సహదేవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటరావుయాదవ్ జన్మదిన వేడుకలు



**మందస, జూన్ 4(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత, మూలిపాడు మాజీ సర్పంచ్, యాదవ సంఘం జిల్లా నాయకుడు గుసిరి వెంకటరావుయాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మూలిపాడులో వెంకటరావుయాదవ్ కు తల్లి ఆదిలక్ష్మి జన్మదిన వేడుకలు తెలిపి, ఆశీస్సులు అందజేశారు. అనంతరం సతీమణి సరస్వతీ, కుమారులు హర్షవర్ధన్, చైతన్య పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి,. బహుమతులను అందజేశారు. గ్రామస్తులు, వైఎస్సార్సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్న వెంకటరావు అభిమానులు స్వయంగా ఆయనను కలసి అభినందనలు తెలిపారు. అనంతరం మందస పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్నేహితులు, సన్నిహితులు కోలాహలం మధ్య వెంకటరావు జన్మదిన వేడుకలు జరిగాయి. యువకునిగా, సర్పంచ్ గా, ఆధ్యాత్మికవేత్తగా, కమ్యునిస్ట్ భావాలు కలిగిన నాయకునిగా, సోషల్ వర్కర్ గా, యాదవ కుల సంఘం నాయకునిగా మంచి గుర్తింపు పొందిన వెంకటరావుయాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో గల ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సోషల్ మీడియాలో పలువురు శుభాకాంక్షలు తెలియజేయగా, మందస ఎంపీటీసీ కంచి బెహరాతో పాటు సార దూర్వాసులు, సీతారాంబెహరా, బైలాడు చైనీ, నాగుబెహరా, కలిగాన వరప్రసాద్, సురేష్, సన్నశెట్టి వెంకటరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు మధ్య కేక్ కట్ చేసి, జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు.

## వంశధార కాలువ మరమ్మతులకు నిధులు .. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



**పలాస, జూన్ 4 వార్త):** వంశధార ప్రాజెక్టు కాలువల మరమ్మతులకు, పూడికతీత, నిర్వహణ పనులకు రూ. 1.9 కోట్ల నిధులను మంజూరు చేయించినందుకు రైతులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారని ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు నిరంజన్ గౌనప తెలిపారు. గురువారం వంశధార ఎడమ కాలువ పనులు పరిశీలించిన అధికారులు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార ఎడమ ప్రధాన కాలువ దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోలేదని గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ దిగువనున్న పిల్ల కాలువలు కూడా పూడిక, ముళ్ల పొదలతో అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. కాలువ గట్లకు గండి పడిన సందర్భంలో తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ శివార ప్రాంతాలకు నీరు అందడం లేదని, ఎమ్మెల్యే శిరీష చాలువుతో మరమ్మతులకు విధులు మంజూరయ్యాయని వెల్లడించారు. సంబంధిత అధికారులు వంశధార ఈఈ, ఏఈకి మరమ్మతులు చేపట్టాలని పలాస ఎమ్మెల్యే శిరీష ఆదేశించినట్లు తెలిపారు. వంశదార సాగునీటి కాలువల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వంశదార ఇరిగేషన్ చైర్మన్ అరవల రవీంద్ర బాబు, ఈ ఈ శేఖర్ బాబు, డిఈఈ లు సుధాకర్ , శ్రీధర్, రాంబాబు , ఏఈఈలు రాజశేఖర్, భాస్కర్, వంశీ కృష్ణ, మీనాక్షి, అధ్యక్షులు వరిస తారకేశ్వర రావు, టి సి జనార్ధన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా నగరంపల్లి గ్రామ దేవత సంబరాలు

**పలాస, జూన్ 4 (వార్త):** నగరంపల్లి గ్రామ దేవత మహోత్సవ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ సంబరాలు సుధూర ప్రాంతాల నుంచి వివిధ దేశాల నుంచి నగరంపల్లికి సంబంధించిన వ్యక్తులు చుట్టూ పక్కల గ్రామానికి సంబంధించిన ప్రజలు ఈ సంబరాల్లో హాజరయ్యారు. ఈ సంబరాల్లో అగ్నిగుండంలో దాసుళ్ళు నడవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిని వీక్షించడానికి పెద్ద ఎత్తున ప్రజలు చుట్టుపక్క గ్రామస్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అనేవి గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవతలకి మొక్కులు చెల్లించి గ్రామదేవతల ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, చుట్టుపక్కల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో వైసీపీ భారీ నిరసన
- టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ బాండ్ల దహనం



**నరసన్నపేట, జూన్ 4 (వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వైకాపా అధిష్ఠానం పిలుపు మేరకు గురువారం నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పోలాకి మండల కేంద్రం ప్రధాన రహదారిపై, నరసన్నపేట పట్టణంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద నిర్వహించిన నిరసనల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎన్నికల ముందు పంపిణీ చేసిన టీడీపీ మేనిఫెస్టో పత్రాలు, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ సంతకాలతో ఉన్న సూపర్ సిక్స్ బాండ్ల కాపీలను రోడ్డుపైనే దహనం చేశారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'తల్లికి వందనం' వంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రెండు సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందలేదని ఆయన పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుందని హెచ్చరించారు. చంద్రబాబు మోసపూరిత వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ నెల 12 వరకు విడతల వారీగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు కరిమి రాజేశ్వరరావు, కనపల శేఖర్‌రావు, చింతు రాఘవరావు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, లుకాలపు రవి, అనుబంధ విభాగాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన ఎంతో సంతృప్తినిచ్చింది

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.930 కోట్ల పనులు చేపట్టా
- ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, జూన్ 4 (వార్త):** రెండేళ్లలో పాలన కూటమి ప్రబుతానికి ఎంతో సంతృప్తినిచ్చిందని,రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకెళ్లిన కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలు ఎంతగానో సంతృప్తి చెందారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పలాస నియోజకవర్గంలో జరుగుతున్న పనులపై ప్రజలు ఎంతగానో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రైతుల కోసం "అన్నదాత సుఖీభవ" పథకం అమలు చేస్తున్నామని, వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పెంచిన పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. "తల్లికి వందనం" పథకం ద్వారా విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిస్తుండగా, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో గృహిణులకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, "స్త్రీ శక్తి" పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. పలాస నియోజకవర్గంలో సుమారు రూ.930 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆమె వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదేవిధంగా ఆఫ్‌షోర్ జలాశయ నిర్మాణాన్ని పూర్తిచేసి సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమృత్ భారత్ పథకం కింద రూ.60 కోట్లతో పలాస రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా వందలాది మంది ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. పలాస ప్రాంత జీడి పరిశ్రమ అభివృద్ధి కోసం జీడి బోర్డు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టామని, అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానభారతి విద్యార్థులకు ఉచితంగా కిట్ల పంపిణీ




**ఇచ్ఛాపురం జూన్ 4(వార్త):** జ్ఞాన భారతీ పాఠశాలలో 2026 -27 విద్యాసంవత్సరానికి సంబంధించి నూతనంగా చేరిన విద్యార్థులకు పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహన అధికారి జోహార్ ఖాన్ మూడు జతల యూనిఫామ్స్, ఒక స్కూల్ బ్యాగ్ ను ఉచితంగా అందించడం జరిగింది. ఈ ఎడాది మార్చి నెలలో జరుపుకున్న సరస్వతి పూజ , తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది పండుగ , రంజాన్ పర్వదినం,ఏప్రిల్ లో ఒడియా వారి నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 30వ తేదీలోగా మా పాఠశాలలో చేరే విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల యూనిఫార్మ్, ఒక స్కూల్ బ్యాగ్ ఉచిత కానుక ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో సుమారు 94 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఆ ప్రకటన వాగ్దానాన్ని నిలుపుకుంటూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు మూడు జతల యూనిఫార్మ్, ఒక స్కూల్ బ్యాగ్ ను ఉచితంగా అందించారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు జతల యూనిఫామ్స్ స్కూల్ బ్యాగ్ అందించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ మాట్లాడుతూ.... నాణ్యమైన విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వివిధ పండుగల సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మూడు జతల యూనిఫార్మ్, ఒక స్కూల్ బ్యాగ్ ను ఉచితంగా అందిస్తామని ప్రకటించి ఆ మేరకు వారికి పంపిణీ చేశామని అన్నారు. ఎల్కేజీ నుంచి 12వ తరగతి వరకు జ్ఞాన భారతి పాఠశాల ఉత్తరాంధ్రలోని అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. నాలుగు దశాబ్దాలపైగా విద్యారంగంలో జ్ఞాన భారతి విశేష సేవలను అందిస్తూ, ప్రపంచానికి అత్యుత్తమ విద్యార్థులను, యువతరాన్ని అందించిందని, భారత సైనిక త్రివిధ దళాలలో ,వివిధ దేశాల్లో అత్యున్నత స్థానాలలో జ్ఞాన భారతి పూర్వ విద్యార్థులు స్థిరపడ్డారని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన విద్యను అందించడమే కాకుండా, శారీరిక మానసిక ఎదుగుదలకు అవసరమయ్యే అంతర్జాతీయ పాఠశాలల స్థాయి వాతావరణన్ని కల్పిస్తున్నామని తెలిపారు. వేదిక్ మ్యాథ్స్ , రోబోటిక్స్, కృత్రిమ మేధ లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని స్పష్టం చేశారు. మైక్రోసాఫ్ట్ హైబ్రిడ్ లెర్నింగ్ ద్వారా 8,9,10 తరగతుల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ

### కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి

**పలాస, జూన్ 4 (వార్త):** హెల్మెట్ తోనే ప్రాణ రక్షణనని కాశీబుగ్గ ఎస్ ఐ ఆర్ నరసింహమూర్తి చెప్పారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఇందిరా చౌక్ జంక్షన్ వద్ద గురువారం రాత్రి కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తోనే ప్రాణ రక్షణ కల్పిస్తుందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు తగిలే దెబ్బల నుండి రక్షణ పొంది, ప్రాణాలను కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రమాద సమయంలో తలకు తగిలే తీవ్ర దెబ్బల నుండి రక్షించి, మరణాలను నివారిస్తుందని అన్నారు. మెదడు చాలా సున్నితమైన అవయవం; హెల్మెట్ దెబ్బల నుండి కాపాడుతుందని అన్నారు. హెల్మెట్ వాడకంపై వివరిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి పలువురు మందుబాబులకు పెనాల్టీలు విధించారు. ఆన్లైన్ మోసాలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాశిబుగ్గ పోలీసులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546